ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 314 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 20 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## ప్రజలకు నచ్చి కాంగ్రెస్
# అధికారంలోకి రాలేదు

### మళ్లీ వందశాతం అధికారంలోకి వస్తాం : కేసీఆర్
### బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి హాజరైన కేసీఆర్
### సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ అంశాలపై చర్చ



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. 7 నెలల విరామం తరువాత పార్టీ కార్యాలయానికి ఆయన వచ్చారు. బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ పాల్గొన్నారు. పార్టీ స్థాపించి 24 సంవత్సరాలు పూర్తై 25వ ఏట అడుగుపెడుతుంది.

**వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం**

ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదని వెల్లడించారు. ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసని, వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటివరకు సుదీర్ఘ ప్రస్థానంపై నేతలకు, కార్యకర్తలకు కేసీఆర్ వివరించారు. ఉద్యమం, తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేశారు.

**ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం:**

ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు ప్రారంభించాలని, సభ్యత్వ నమోదు తర్వాత సంస్థాగత కమిటీల ఏర్పాటు ..మిగతా 2లో




## ఏప్రిల్ 27న బిఆర్ఎస్
# భారీ బహిరంగ సభ

### ప్రజా ఉత్సవంగా బిఆర్ఎస్ రజతోత్సవం
### ఏడాది పొడవునా కార్యక్రమాల నిర్వహణ: కెటిఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** భారాస రజతోత్సవం.. ప్రజా ఉత్సవంగా జరపాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఏడాది పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను తిప్పికొడతామని అన్నారు. తెలంగాణ భవన్‌లో అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సమావేశం వివరాలు వెల్లడించారు. 'ప్రజా ఉద్యమాలు, విప్లవ పోరాటాలకు పురిటిగడ్డ తెలంగాణ. తెలంగాణ పోరాటంలో ప్రాణత్యాగాల గురించి సమావేశంలో గుర్తు చేసుకున్నాం. రాబోయే కాలంలో పార్టీ కార్యక్రమాలపై కేసీఆర్ దిశానిర్దేశంచేశారు. అధికారమే పరమావధిగా పనిచేసే ఆలోచన లేదు. తెలంగాణ అస్తిత్వం, ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. భారాస రజతోత్సవాలు ఏడాది పాటు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించాం. ఉత్సవాల ..మిగతా 2లో

## బీఆర్ఎస్ బాటలోనే
# కాంగ్రెస్ నడుస్తుంది

### బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు : ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఇలాగే చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఈటెల రాజేందర్.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని విమర్శించారు. అదే తరహాలో కాంగ్రెస్ నడుస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు 3 రెట్లు అధికంగా పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఈటల ఆరోపించారు. జాతీయ రహదారుల కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని.. కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని ఈటల రాజేందర్ తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ భూ సేకరణలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ ..మిగతా 2లో



## అక్రమ వలసదారులపై
# ఉక్కుపాదం

### కాళ్లకు సంకెళ్లు.. చేతులకు బేడీలు
### వీడియోను విడుదల చేసిన ఎలన్ మస్క్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చిన తరవాత భారతీయులను అక్రమ వలసదారులుగా ముద్రవేసి తిరిగి పంపిన దారుణానికి సంబంధించిన వీడియోని వైట్ హౌస్ విడుదల చేసింది. విమానం ఎక్కే ముందు వలసదారులకు సంకెళ్లు వేయడాన్ని వీడియోలో చూడవచ్చు. 41 సెకన్ల వీడియోను ఎక్స్ సిఈఓ ఎలెన్ మస్క్ తన ఖాతాలో షేర్ చేస్తూ.. 'హహా వావ్' అనే వ్యాఖ్య చేశారు. చేతులు, కాళ్ళు కట్టి వలసదారులను బందీలుగా ఉన్నట్లుగా, కఠినంగా తనిఖీ చేస్తున్నట్లు వీడియోలో ఉంది. మానవ ..మిగతా 2లో




## ఛత్రపతి శివాజీ చిత్రపటానికి
# సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి

### జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వేడుకలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. భారత దేశానికి అపారమైన సేవలు అందించిన శివాజీ మహారాజ్ వీరత్వం, పరిపాలనా నైపుణ్యం స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొని శివాజీ మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పరిపాలనా విధానాలు నేటితరానికి మార్గదర్శకంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సేవలో ప్రతి నాయకుడు పని చేయాలని నేతలు సంకల్పం వ్యక్తం చేశారు.

# కుంభమేళాతో అయోధ్య, వారణాసిలకు తాకిడి

### భారీగా తరలివస్తున్న భక్తులతో జనసంద్రం
### అయోధ్య రామాలయ పనులకు తీవ్ర అంతరాయం

**అయోధ్య, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** మహాకుంభమేళా సందర్భంగా వారణాసి, అయోధ్య రామమందిరానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది. దీంతో ఈ రెండు నరగాల్లో వాహన రాకపోకలు కూడా ఇబ్బందిగా మారాయి. కుంభమేళా తిరుగు ప్రయాణంలో భక్తులు అయోధ్య, వారణాసిలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో అయోధ్య రామమందిరం నిర్మాణ పనులు ఆగిపోయాయని కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. రామాలయ నిర్మాణ పనులు 25 రోజులుగా ఆగిపోయినట్లు ఆయన తెలిపారు. మార్చి నెలలో పూర్తి కావాల్సిన పనులు ..మిగతా 2లో




# వనపర్తి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం

### 4 వేలకు పైగా చనిపోయిన కోళ్లు
### సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు

**వనపర్తి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** జిల్లాలోని బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. మదనపురం మండలం కొన్నూరు గ్రామంలో శివకేశవరెడ్డి అనే రైతుకు చెందిన కోళ్ల ఫామ్‌లో 4000 కోళ్లు మృత్యువాతపడ్డాయి. బర్డ్ ఫ్లూ వ్యాధితో ఇంత పెద్ద సంఖ్యలో కోళ్లలో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఎప్పటి లాగే బుధవారం ఉదయం రైతు శివకేశవరెడ్డి కోళ్లఫామ్‌కు వచ్చి చూడగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోయి కనిపించాయి. దీంతో వాటిని గుంతలో పోడ్చేశారు. అయితే నాలుగువేళ్ల కోళ్ల మృతిపై వెటర్నరీ అధికారులకు రైతు సమాచారం ఇచ్చాడు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. కోళ్లు చనిపోవడంపై రైతు మాట్లాడుతూ.. ఇన్ని కోళ్లు చనిపోవడానికి కారణం ఏంటో చెప్పాలని.. తనకు న్యాయం చేయాలని కోరారు. బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని అనుకుంటున్నానని.. దానిపై అధికారులు నిర్ధారణ చేయాలన్నారు. ప్రతీసారి తనకు కోళ్లపై లాభం వచ్చేదని.. కానీ ఈసారి మాత్రం ..మిగతా 2లో





### ఫోన్ ట్యాపింగ్ కేసులో
# హరీశ్‌రావుకు ఊరట
## కేసు దర్యాప్తుపై హైకోర్టు స్టే

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం):** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావు, రాధా కిషన్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు స్టే ఇచ్చింది. పిటిషన్‌పై తదుపరి విచారణ చేపట్టే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని న్యాయస్థానం స్టే విధించింది. తన ఫోన్ ట్యాప్ చేశారంటూ రియల్టర్ చక్రధర్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో హరీశ్‌రావు వద్ద గతంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎఫ్ఐఆర్ క్వాష్ చేయాలని హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు పిటిషన్ దాఖలు చేయగా.. అరెస్టు చేయొద్దని గతంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈకేసులో ప్రభుత్వం తరఫున వాదనల కోసం లాయర్ సిద్దార్థ లూథ్రా వస్తారని పీపీ తెలిపారు. మరో కేసులో లూథ్రా బిజీగా ఉన్నందున వాదనలకు పీపీ సమయం కోరారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది.

### కుంభమేళాతో
# అయోధ్య, వారణాసిలకు తాకిడి

మొదటి పేజీ తరువాయి...

జూన్ నాటికి అవుతాయని నృపేంద్ర వెల్లడించారు. అయోధ్యలోని రామ జన్మభూమి సముదాయంలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులపై నృపేంద్ర మిశ్రా నేతృత్వంలో రెండు రోజులుగా సమావేశాలు జరుగుతున్నాయి. నిన్న(మంగళవారం) మె?దటి రోజు జరిగిన సమావేశంలో ఆలయానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నృపేంద్ర తెలిపారు. ఆయన నిర్మాణాలు పరిశీలించామని, అలాగే కొన్ని కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. మహాకుంభమేళా సందర్భంగా అయోధ్య బాల రాముడి దర్శనార్థం వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయ దర్శన, నిష్క్రమణ ద్వారాలను విస్తరించాలని ప్రణాళికలు రూపొందించినట్లు నృపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి నిర్మాణ కమిటీలోని ముఖ్య సభ్యులందరూ నేడు ఆలయాన్ని పరిశీలించి చర్యలు చేపడతారని చెప్పారు. అలాగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో భక్తుల బూట్లు, చెప్పులు ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రామ జన్మభూమి సముదాయంలోని 11వ నంబర్ గేట్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభ మయ్యాయని, అయితే భక్తుల తాకిడి వల్ల గేట్ నంబర్ 3 పనుల పూర్తి ప్రస్తుతం సాధ్యం కాదని చెప్పారు. అయితే ప్రస్తుతం మహాకుంభమేళాకు భక్తుల తాకిడి కొంతమేర తగ్గినందున ఇప్పటికే సిద్ధం చేసిన తులసీదాస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు నృపేంద్ర తెలిపారు. మరోవైపు జూన్ నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని, సెప్టెంబర్ నాటికి ప్రాకార నిర్మాణం పూర్తవుతుందని నిపేంద్ర వెల్లడించారు. కాగా, నేడు జరిగే సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది

### అక్రమ వలసదారులపై
# ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి...

హక్కులను పూర్తిగా ఉల్లంఘించే షాకింగ్ దృశ్యాలు బయటకు వచ్చాయి. ట్రంప్ వలసదారులను బహిష్కరించే విధానానికి వ్యతిరేకంగా అనేకచోట్ల నిరసనల జరుగుతున్న నేపథ్యంలో ఈ వీడియోను విడుదల చేశారు. అదే సమయంలో ట్రంప్ ప్రభుత్వం 300 మందికి పైగా వలసదారులను పనామాలోకి అక్రమంగా తరలించింది. బహిష్కరించబడిన వారిలో ఎక్కువ మంది ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, చైనా వంటి దేశాల నుండి వచ్చారు. వారి మొబైల్ ఫోన్లు, పాస్‌పోర్ట్‌లు జప్తు చేయబడ్డాయి. వారిని పనామాలో నిర్బంధంలో ఉంచారు. నివేదికల ప్రకారం, పనామాను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ ఒత్తిడి వ్యూహంలో భాగంగా వలసదారులను పనామాలోకి అక్రమంగా తరలించారు. భారతదేశంతో సహా ఆసియా దేశాల నుండి వలస వచ్చిన వారిని అమెరికా బహిష్కరిస్తున్నందున, తాత్కాలిక ఆశ్రయాన్ని సిద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కోస్టారికా మంగళవారం అధికారికంగా ప్రకటించింది. మొదటి దశలో 200 మంది ప్రయాణికులతో కూడిన విమానం బుధవారం దేశంలోని జువాన్ శాంటామారియా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటుంది.

### వనపర్తి జిల్లాలో
# బర్డ్‌ఫ్లూ కలకలం

మొదటి పేజీ తరువాయి...

పూర్తి నష్టపోయాయనని న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు. కాగా.. 5500 కోళ్ల కెపాసిటీతో నిర్మించిన శివకేశవరెడ్డికి చెందిన కోళ్లఫామ్‌లో నాలుగువేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. ఈ కోళ్లను ప్రీమియర్ కంపెనీ నుంచి సాకుతున్నాడు రైతు. అయితే నిన్నటి నుంచి కోళ్లు చనిపోవడాన్ని గుర్తించిన శివకేశవ రెడ్డి కంపెనీ యాజ మాన్యానికి ఫోన్‌లో సమాచారం అందించారు. అయితే దీన్ని తేలిగ్గా తీసుకున్న కంపెనీ యాజమన్యం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రైతుకు చెప్పింది. అయితే బర్డ్ ఫ్లూగా అనుమానించిన శివకేశవరెడ్డి నిన్న చనిపోయిన 500 కోళ్లను గొయ్యి తీసి పాతిపెట్టాడు. దాదాపు 4000 కోళ్లు మృత్యువాత పడటంతో వాటిని కూడా గోతి తీసి పాతిపెట్టాడు రైతు. ఇలా వరుసగా కోళ్లు చనిపోవడంపై పశుసంవర్ధక శాఖ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామంలో పౌల్ట్రీ రైతులు ఆందోళనకు దిగారు.

### సైబర్ నేరాల నుంచి
# ప్రజలను కాపాడడమే లక్ష్యం
## సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ ముగింపులో డిజిపి జితేందర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** సైబర్ మోసాల నుంచి ప్రజలను కాపాడడం తమ బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. ప్రతిష్టాత్మక సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సైబర్ నేరాలు పెరిగిపోయాయని.. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇటీవలే రాష్ట్రంలో దేశంలో వేల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. చాలామంది అమాయకులు మోస పోతున్నారన్నారు. సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ కి 14 రాష్ట్రాల నుంచి స్టూడెంట్స్, నిపుణులు రావడం సంతోషంగా ఉందని డీజీపీ జితేందర్ తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ బాధ్యతాయుతంగా కలిసి కట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

### ప్రజలకు నచ్చి కాంగ్రెస్
# అధికారంలోకి రాలేదు



మొదటి పేజీ తరువాయి...

చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అక్టోబర్, నవంబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని, పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ కాదు బీఆర్ఎస్ కాదని, కేసీఆర్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్, తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దిన పార్టీ బీఆర్ఎస్ అని అని వెల్లడించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయమని అన్నారు. ప్రజల్లో ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతోందని, ఇక లేవదని ఎద్దేవా చేశారు.

నాయకులకు కేసీఆర్ దిశానిర్దేశం : ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో ఆయన చర్చించారు. ఆవిర్భావ వేడుకలు, సభ్యత్వ నమోదు, భారీ బహిరంగ సభ, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ వివిధ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన కార్యాచరణపై ఆ పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.






## పెద్ద షాపూర్‌లో మల్లన్న గుడి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోండి:
### మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య

శంషాబాద్, ఫిబ్రవరి 19( ప్రభాత ఉదయం ) శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మల్లన్న గుడి పనులను అడ్డుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శంషాబాద్ తాసిల్దార్ రవీందర్ దత్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పెద్ద షాపూర్ సర్వే నంబర్ 244లో ఉన్న ప్రభుత్వ భూమిలో గ్రామస్తులందరూ చందాలు వేసుకొని మల్లన్న గుడి నిర్మిస్తున్నారని మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ తాసిల్దార్ కు వివరించారు. ఈ భూమి గతంలో కాసారం పద్మమ్మ కుటుంబానికి ప్రభుత్వం కేటాయించగా ఆ భూమిని ఇతరులకు విక్రయించుకున్నారని తెలిపారు. దీనితో రెవెన్యూ అధికారులు పీవోటీ చట్టం కింద దాన్ని స్వాధీనం చేసుకొని ఒక ఎకరా 14 గుంటల భూమిని పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. 20 గుంటల భూమిని అగ్నిమాపక శాఖకు కేటాయించారు. కోతి స్థలం ఉండడంతో గ్రామస్తులు అందరూ కలిసి మల్లన్న గుడి నిర్మిస్తున్నారని ఆయన వివరించారు. ఈ విషయమై గతంలో తాము అధికారులకు కూడా సమాచారం ఇవ్వగా వారు నోటిమాటగా కట్టుకోమని సూచించారని తెలిపారు. కాగా పద్మమ్మ వారసులమంటూ కొంతమంది వచ్చి గుడి నిర్మాణాన్ని అడ్డుకొని పనులను నిలిపివేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పెద్ద షాపూర్ లోని 220 సర్వే నంబర్ భూమిలో గతంలో హనుమాన్ దేవాలయం. సేవాలాల్ మందిరం నిర్మించడం జరిగిందని అదే మాదిరిగా మల్లన్న గుడికి అనుమతి ఇవ్వాలని చెక్కల ఎల్లయ్య అధికారులను కోరారు. తాసిల్దార్ ను కలిసిన వారిలో మాజీ ఉప సర్పంచ్ బుద్ధం మహేందర్ యాదవ్. నారాయణ యాదవ్. గోపనమోని మల్లేష్ యాదవ్. బొద్దం కృష్ణ యాదవ్. శ్రీశైలం యాదవ్. గోపనమోని వెంకటయ్య. శ్రీకాంత్ యాదవ్. కన్నా. శ్రీనివాస్. జి రఘు. కృష్ణ. శంకర్. శేఖర్. చంద్రకాంత్. తదితరులు పాల్గొన్నారు.

### సిఇసిగా బాధ్యతలు స్వీకరించిన
# జ్ఞానేశ్ కుమార్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):** భారత 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఈసి)గా జ్ఞానేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 2024 నుండి ఎన్నికల కమిషనర్‌గా ఉన్న ఆయన సోమవారం నాడు సిఈసిగా పదోన్నతి పొందారు. మంగళవారం పదవీ విరమణ చేసిన రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేష్ కుమార్ పోల్ ప్యానెల్ అధిపతిగా నియమితులయ్యారు. అయితే ఆయన నియామకాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. అర్ధరాత్రి సమయంలో సీఈసీ పేరు ప్రకటించడమేంటి? అని నిలదీసింది. ఇక ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. బుధవారం విచారణకు రానున్నాయి.

### బీఆర్ఎస్ బాటలోనే
# కాంగ్రెస్ నడుస్తుంది

మొదటి పేజీ తరువాయి...

హై వే పనులు వేగంగా జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఈటల విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇకనైనా కళ్లు తెరవాలని హితవు చెప్పారు ఎంపీ. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని ఎంపీ ఈటల ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేసే పరిస్థితి లేదని ఈటల స్పష్టం చేశారు. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారాయన. కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణనకు చట్టబద్ధత ఉందా? అని ఎంపీ ప్రశ్నించారు. తమిళనాడులో చేసిన విధంగా చేస్తే స్వాగతిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి కట్టుబడి కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.




### ఏప్రిల్ 27న బిఆర్ఎస్
# భారీ బహిరంగ సభ

మొదటి పేజీ తరువాయి...

నిర్వహణకు సీనియర్ నేతల ఆధ్వర్యంలో త్వరలో కమిటీలను ఏర్పాటు చేయబోతున్నామని కేటీఆర్ తెలిపారు. ఇదిలావుంటే ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఏడాది పొడవునా ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. అలాగే, పార్టీ కమిటీలు వేయాలని నిర్ణయించిన కేసీఆర్.. కమిటీలకు ఇన్‌చార్జ్‌గా హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏప్రిల్ పదో తేదీ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని.. ప్రతి జిల్లా కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. అనుబంధ సంఘాల పటిష్టత కోసం సీనియర్ నేతలతో సబ్ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. అదే నెల 10న పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందని చెప్పారు.

# రాజేంద్రనగర్‌లో ద్రాక్ష మేళా



ద్రాక్ష తోటలో రెడీగా ఉన్న ద్రాక్ష పండ్లు

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లో గురువారం నుంచి ద్రాక్ష మేళా ప్రారంభం కానుంది. ద్రాక్ష పరిశోధన స్థానంలో 10 ఎకరాలలో పండించిన 53 రకాల ద్రాక్ష పండ్లను ఈ మేళాలో విక్రయించనున్నారు. తోటకు వెళ్లి నేరుగా కోసుకునే అవకాశాన్ని నిర్వాహకులు కల్పిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ ద్రాక్ష మేళా ఉంటుంది. రకాన్ని బట్టి ధర నిర్ణయిస్తారు. ఇక్కడ ప్రత్యేకత ఏంటంటే ద్రాక్ష తోటలోకి నేరుగా వెళ్లి ఇష్టమైన పండ్లను రుచి చూసి కోసుకుని కొనుక్కోవడం. ప్రతి సంవత్సరం రాజేంద్రనగర్ లో నిర్వహించే ఈ ద్రాక్ష మేళా కు భారీ స్పందన వస్తుంది. వీకెండ్ లో కుటుంబ సభ్యులతో కలసి వచ్చి మరీ ద్రాక్ష పండ్లను కొనుగోలు చేస్తారు. ఫోటోలు. సెల్ఫీలు దిగుతు ఎంజాయ్ చేస్తారు.

**ద్రాక్ష ఆరోగ్యానికి మంచిది :**

సీజనల్ పండ్లను తప్పనిసరిగా తినాలని పెద్దలు, డాక్టర్లు చెబుతారు. అలాంటి వారికి చక్కని అవకాశం కల్పిస్తు ద్రాక్ష తోటలోనే నేరుగా ద్రాక్ష పండ్లను రుచి చూసి కొనుక్కునే అవకాశం కల్పిస్తున్నారు నిర్వాహకులు. ద్రాక్షలో రోగనిరోధక శక్తిని ఇచ్చే యాంటీ యాక్సిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మ నిగారింపుకు కూడా బాగా పనిచేస్తాయి. రుచి చూసి తమకు ఇష్టమైన పం డ్లను కోసుకోవచ్చు. ప్రతి సంవత్సరం ద్రాక్షతోటకు వేలం పాట నిర్వహిస్తారు. ఈ సారి జరిగిన వేలం పాటలో రూ.4.65 లక్షలకు తోటను తీసుకున్న రాజేంద్రనగర్ కు చెందిన మంగళారం కార్తీక్ నేరుగా తోటలోకి వచ్చి పండ్లు కోసుకునే వెసలుబాటు కల్పిస్తున్నారు. గురువారం నుంచి ద్రాక్ష మేళా నిర్వహించి పండ్ల విక్రయాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సుమారు 10 ఎకరాలలో ఈ ద్రాక్ష తోట ఉ ంది.

**రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ముందు భాగంలో తోట**

రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల (కొత్త) భవనం ముందు నుంచి ఉన్న రహదారి గూండా వెళితే ద్రాక్ష పరిశోధనా కేంద్రం వస్తుంది. మెహిదీపట్నం, దిల్సుక్ నగర్, బహదూరురా నుంచి వచ్చే కొనుగోలు దారులు 215 పిల్లర్ మలుపు నుంచి వెటర్నరీ కళాశాల కు రావచ్చు. అక్కడి నుంచి నేరుగా ముందుకు వెళితే తోట వస్తుంది.

**అందుబాటులో ఉన్న రకాలు :**

ద్రాక్ష తోటలో 53 రకాల పండ్లు ఉన్నాయి. వాటిలో మంజరి శామ, మంజరి మెడిక, కట్ట కుర్గాన్, రెడ్ గ్లోబ్, ఫ్లేమ్ సీడ్ లెస్ , కిస్మిస్ చోర్ని, థామ్సన్ సీడ్ లెస్, శరద్ సీడ్ లెస్, కిస్మిస్ రోజావిస్ వైట్, థామ్సన్ సీడ్ లెస్ , కిస్మిస్ రోజావిస్, మెరిడియన్ సీడౌస్. హెచ్-516, టేబుల్ జూస్, వైన్ జూస్ , మారు సీడ్ లెస్, ఫాంటసీ సీడ్ లెస్ , 17-3 రకం, భారత్ ఎర్లీ, మధు అంగూర్, సిరాజ్, అర్క శ్యామ్ తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. రకాన్ని బట్టి ధర ఉ ంటుందని నిర్వాహకులు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న గుర్తించాలి:మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యేసు రత్నం

## పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యేసు రత్నం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ ఏ.ఆర్.దేవరాజ్ భవన్ కార్యాలయంలో ఈరోజు తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె యేసు రత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా యేసు రత్నం మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి కార్మికులను పర్మినెంట్ చేసే అంతవరకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా మున్సిపల్ కార్మికులకు ప్రతి నెల ఒకటో తారీకు నాడు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. కార్మికులపై పని భారాన్ని తగ్గించాలి బస్తీలు రోజు రోజుకు పెరుగుతున్నాయి కాలనీలకు అనుగుణంగా కార్మికులను కూడా పెంచాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి ఐదు లక్షల రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి ఇంట్లో వారికి ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలన్నారు. కార్మికులకు సంవత్సరానికి ఒక కిట్టు ఇస్తున్నారు. అవి దేనికి సరిపోవటం లేదు ఆరు నెలలకు ఒకసారి కిట్టు ఇవ్వాలని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచకుంటే డిసెంబర్ నెలలో పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం యూనియన్ మహాసభలు నిర్వహించాలన్నారు. ముఖ్య కార్యకర్తల సమావేశం ఈనెల 21వ తేదీన(శుక్రవారం ) బుద్వేల్ ఏ.ఆర్.దేవరాజ్ భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి టి.ఆనంద్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, సత్యం, ఏ.సంగారెడ్డి, పి.నర్సింలు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

బండ్లగూడ, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం గురువారం అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఏం ఎంక్లేవ్ 1,2, సి యల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కృతి విల్లాస్ ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



మామిడి పండ్లు





## నేడు ఫ్రోజోన్ మామిడి పండ్ల ప్రదర్శన

### విక్రయాలు ప్రారంభించనున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ హిమాయత్ సాగర్ రోడ్డులో వాలంతరి కి ఎదురుగా ఈ నెల 20 నుంచి ఫ్రోజోన్ మామిడి పండ్ల ఎగ్జిబిషన్, సేల్ నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం 5గంటలకు ఈ ఎగ్జిబిషన్, సేల్ ను రాష్ట్ర శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి సుజాత్ అలీ లు పాల్గొననున్నారు.

**ప్రదర్శనలో 60 రకాల మామిడి పండ్లు :**

సంగారెడ్డి జిల్లా కోహీర్ లో సల్మానీ బ్రదర్స్ కు ఉన్న 100 ఎకరాల పండ్ల తోటలో మామిడి పం డ్లను పండిస్తున్నారు. గురువారం నిర్వహించనున్న మామిడిపండ్ల ఎగ్జిబిషన్ లో 50 నుంచి 60రకాల మామిడి పండ్లను ప్రదర్శనలో ఉంచనున్నారు. 12 రకాలను మాత్రం విక్రయించడానికి అందుబాటులో ఉంచుతున్నారు. సల్మానీ రేర్ రాయల్ ఫ్రోజోన్ మ్యాంగోస్ పేరుతో ఈ విక్రయాలను చేపడుతున్నారు. కార్బన్ లేకుండ సహజ సిద్ధమైన ఎండు గడ్డిలో మక్కబెట్టిన మామిడి పండ్లను డీ ఫ్రీజ్ చేసి థర్మల్ బాక్స్ లో పెట్టి విక్రయాలు జరుపనున్నారు. విక్రయిం చడానికి సిద్ధంగా ఉన్న ఈ 12 రకాల మామిడి పండ్లను కిలో రూ.500ల చొప్పున విక్రయిం చనున్నట్లు నిర్వాహకులు సల్మానీ తెలిపారు. జాఫ్రాన్. సుల్తాన్ ఉర్ సమర్, సఫీదా, అనర్కలి, కెహురుబా, ఫరేబీ, కోకోనట్ లైమ్ తదితర రకాలను విక్రయించడానికి అందుబాటులో ఉ ంచామన్నారు. ఇతర వివరాలకు 9391731113 కి సంప్రదించవచ్చన్నారు.



సహజ సిద్ధంగా ఎండు గడ్డిలో ఉంచి మక్క బెట్టిన మామిడి పండ్లు..



చెట్టుపై మామిడి పండ్లు



మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్, మజ్లీస్ కార్యకర్తలు

## వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ కు చెందిన పలువురు కాంగ్రెస్, మజ్లిస్ కార్యకర్తలు బుధవారం శ్రీనగర్ లోని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, యువ నాయకుడు పి.కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ తెలిపారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిం చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి తగిన సమయంలో గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వర్, నవాజ్, మోహిన్, ఖాన్ లతో పాటు బీఆర్ఎస్ నాయకులు నోముల రాము యాదవ్. అక్కెం రాఘవేందర్ యాదవ్, రవి, ఈశ్వర్, వెంకటేశ్, రాజు, చిరంజీవి. రాజ్కుమార్, అశోక్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ మంచినీటి పైప్లైన్ లీకేజ్ పనులను సత్వరమే చేపట్టిన సిబ్బంది

కొత్తకోట, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలోని మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీ అవుతుందని స్థానికులు మున్సిపల్ కమిషనర్ సైదులుకు సమాచారం అందించారు. సోషల్ మీడియాలో కూడ పెట్టడం జరిగింది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ సైదులు వెంటనే మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ కి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించటంతో వెంటనే తాత్కాలిక మరమ్మత్తు చేపట్టారు. దీంతో మంచినీటి కాకుండా సిబ్బంది తగిన చర్యలు చేపట్టడం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో రెండు రోజుల్లో రిపేర్ చేస్తామని టెక్నీషియన్లు తెలియజేయడం జరిగింది. ఈ లీకేజీల గురించి మునిసిపల్ వాటర్ మెన్ లు మిషన్ భగీరథ వారికి తెలియజేయాలి. కానీ వారి నిర్లక్ష్యం వల్ల పౌరులం మనం తెలియజేస్తేనే అధికారులకు తెలియడం అంటే వాటర్ మెన్ ల నిర్లక్ష్యం ఎంత ఉందో తెలుస్తుంది. ఏది ఏమైనా మిషన్ భగీరథ వాటర్ లీకేజీ పై వెంటనే స్పందించి వాటర్ లీకేజీని అరికట్టిన మున్సిపల్ కమిషనర్ సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.



మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



అనిత

## కాటేదాన్‌లోని కమల ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ యంత్రంలో పడి ఓ మహిళ దుర్మరణం

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం): కాటేదాన్ లో గల రవి ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కం పెనీలకు చెందిన కమల ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ లో స్వీపర్ గా పనిచేస్తున్న అనిత (30) అనే మహిళ ప్రమాదవశాత్తు యంత్రంలో పడి దుర్మరణం చెందారు. ఈ సంఘటన బుధవారం మద్యాహ్నం జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. లక్ష్మీగూడ కు చెందిన అనిత, మహేష్ లు భార్యభర్తలు. వీరికి ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పిల్లలు లేరు. కాటేదాన్ లోని కమల ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ -2లో ఆమె స్వీపర్గా పనిచేస్తుంది. బుధవారం మద్యాహ్నం పరిశ్రమలో తూడుస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం లో ఆమె చీర పడి దుర్మరణం చెందింది. ఆమెను అసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. అనిత భర్త మహేశ్ ఫిర్యాదు చేశారు కమల ఫుడ్స్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. మైలార్ దేవుపల్లి ఇన్స్పెక్టర్ నరేందర్ పర్యవేక్షణలో ఎస్ఐ సత్యకుమార్ దర్యాప్తు చేసు న్నారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్..



శివాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పి కార్తీక్ రెడ్డి..



శివాజీ విగ్రహానికి నివాళులు అర్పించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం): రాంబాగ్ ఛత్రపతి శివాజీ మహారాజ్ యువ సమితి ఆధ్వర్యంలో రాంబాగ్ పురవీధులలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా శోభా యాత్ర నిర్వహించారు. భాగ్యనగర్ సమాసత్ భజన మండలి ఆధ్వర్యంలో శోభా యాత్రలో దారి పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మైలార్ దేవుపల్లి శివాజీ చౌక్, బృందావన్ కాలనీలలో జరిగిన శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి లు పాల్గొని శివాజీ మహరాజ్ విగ్రహానికి నివాళులర్పించారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో జరిగిన శోభాయాత్ర, ఊరేగింపులో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాలలో వివిధ పార్టీల నాయకులు ఎన్.ధనుంజయ. సరికొండ వెం కటేశ్, ఎస్.వెంకటేశ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, నోముల రాము యాదవ్. డి.రమేశ్ మ దిరాజ్, రావుల భాస్కర్, టి.ప్రేంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.




బర్డ్ ఫ్లూ పై కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## చికెన్ వ్యాపారస్తులకు బర్డ్ ఫ్లూ వ్యాధిపై సూచనలు, సలహాలు అందజేయాలి

కొత్తకోట, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)చికెన్ వ్యాపారస్తులకు బర్డ్ ఫ్లూ వ్యాధి పై తగు సూచనలు, సలహాలు అందజేయాలని కొత్తకోట మున్సిపాలిటీ కమీషనర్ సైదయ్యకు స్థానిక నాయకులు కె ప్రేమదానం వినతి పత్రం అందజేశారు. బర్డ్ ఫ్లూ వ్యాధి అతివేగంగా వ్యాప్తి చెందుతున్న క్రమంలో కొత్తకోట పట్టణ నాయకులు కె.ప్రేమధనం, జె.డి సంపత్, కొమ్ము రవికుమార్, సంజీవ రావు తదితరులు మున్సిపాలిటీ కమీషనర్ సైదయ్య కు వినతిపత్రం అందజేసి పట్టణాన్ని ఆరోగ్య పట్టణంగా ఉంచాలని కమీషనర్ సైదయ్యను కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు

## ఈనెల 22న పామాయిల్ కంపెనీ భూమి పూజ చేయనున్న రాష్ట్రమంత్రులు

### సంకిరెడ్డిపల్లిలో పామాయిల్ ఫ్యాక్టరీ

కొత్తకోట, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ కి రాష్ట్ర మంత్రులు భూమి పూజ చేయనున్నారని కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బుధవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినా విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... పామ్ ఆయిల్ పంటలకు రైతులు ప్రాధాన్యమివ్వాలనీ సంకల్పంతో ఈనెల 22 తేదీన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ,జూపల్లి కృష్ణారావు,తుమ్మల నాగేశ్వరరావు,వీరితో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గొల్ల బాబు, మండల అధ్యక్షులు బీచుపల్లియాదవ్, టౌన్ అధ్యక్షులు పోతుల పల్లి శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి , మాజీ ఉపసర్పంచ్ ఎన్ జే బోయేజ్ , మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం ఖాన్ , జెసిబి రాములు , సుభాష్, రామ్ లాల్, మోహన్ రెడ్డి, మండ్ల తిరుపతి, ఎజాజ్ భాయ్,పసుపుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

## మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి: సీఐటీయూ డిమాండ్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆధారంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న వర్కర్లకు కేటగిరీల వారిగా వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు శివ, హెచ్.రవి డిమాండ్ చేశారు బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటగిరిల వారిగా జీతాలు పెంచిందని కానీ గద్వాల మున్సిపాలిటిలో కేటగిరిల వారిగా జీతాలు ఇవ్వకుండా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా కార్మికులను నియమించుకోకపోవడం వల్ల కార్మికులు అదనపు పని భారాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు .ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ వెంకటస్వామి మాట్లాడుతూ... పట్టణ పురవీధులను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదన్నారు .ఎన్నికల హామీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారిని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా కార్మికులపై పని గంటలను పెంచి అదనపు పని భారాలు మోపుతున్నదని విమర్శించారు .అదనపు పని భారాలతో కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు .ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారి మహేష్, ఉపాధ్యక్షులు రాజు రఘు, సహయ కార్యదర్శులు హనుమంతు ,లలితమ్మ కమిటీ సభ్యులు శివకుమార్ ,ఆటో నరసింహ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మరో లాయర్ మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) లాయర్లు గుండెపోటు ఘటనలు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కోర్టు ఆవరణల్లో కుప్పకూలుతున్నారు. ఓ కేసుకు సంబంధించి తన క్లయింట్ తరుఫున వాదనలు వినిపిస్తున్న లాయర్ వేణుగోపాల్ గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడున్న తోటి లాయర్లు, కోర్టు సిబ్బంది హాస్పిటల్‌కు తరలించే లోపే మార్గమధ్యలో మృతి చెందారు. ఇటీవల తెలంగాణ హైకోర్టులో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది.. తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్ కోర్టులో గుండెపోటుతో అడ్వకేట్ మృతి చెందారు. కోర్టు ఆవరణలో ఉన్న బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేస్తుండగా గుండెపోటుకు గురైన వెంకటరమణ మృత్యువాత పడ్డారు. ఆసుపత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయారు. 25 సంవత్సరాలుగా సికింద్రాబాద్ కోర్టులో అడ్వకేట్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ మృతితో లాయర్లు సంతాపం వ్యక్తం చేశారు. వరుస లాయర్ల మరణాలతో సాధారణ ప్రజల్లో కూడా భయం మొదలైంది. లాయర్లు ఈ గుండెపోటు విషయంలో సరైన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. నిత్యం వాదనలు, కేసులతో బిజీగా ఉంటున్న లాయర్లు తమ ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.

# ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తి ప్రధాత: ఎమ్మెల్యే జీఎంఆర్



చిన్న రాజమూర్ లో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తి ప్రధాత అని దేవరకద్ర శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర మండలం చిన్న రాజమూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్ర గొల్ల ప్రేమ్ కుమార్ యాదవ్ ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ ఒక సామాన్యమైన కుటుంబం పుట్టి తల్లికి ఇచ్చిన మాట కోసం, మహా చక్రవర్తి గా ఎదిగి ఎందరికో ఛత్రపతి శివాజీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. అనంతరం చిన్న రాజాపూర్ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ ,నాగన్న పల్లి గ్రామంలో హైమాక్స్ లైట్లను ప్రారంభించి, కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు.

## శివాజీ జయంతి సందర్భంగా నర్కుడలో కదం తొక్కిన యువత



శంషాబాద్, ఫిబ్రవరి 19( ప్రభాత ఉదయం) చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నర్కుడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక యువజన సంఘం నాయకులు బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల ముఖ్య నాయకులు హాజరై శివాజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. జై భవాని వీర శివాజీ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఉన్నారు కూడా గ్రామం నుండి అమ్మపల్లి దేవాలయం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి నీరెడ్డి తన్వి రాజు ముదిరాజ్. బిజెపి నాయకులు నాన్న వాళ్ళ కుమార్ యాదవ్. మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు కనకమామిడి కిట్టు ముదిరాజ్. మాజీ సర్పంచ్ చునిగంటి సిద్దులు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్. మాజీ ఎంపీటీసీలు చందన వెల్లి శ్రీనివాస్. గౌతమి అశోక్. మెండే కుమార్ యాదవ్. నీరటి శేఖర్ ముదిరాజ్. నీరటి అశోక్. తదితరులు పాల్గొన్నారు.

## మరాఠా సామ్రాజ్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శివాజీ


### యువతకు ఛత్రపతి శివాజీ ఆదర్శం: ప్రిన్సిపల్ చవ్వా వెంకట్ రెడ్డి




పీజీ సెంటర్లో చత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) పీజీ సెంటర్ గద్వాల్ లో విద్యార్థుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు జిజియా బాయి, షహజీల క్రమశిక్షణలో పెరిగి, విద్యజ్ఞానం గడించిన శివాజీ , మరాఠా సామ్రాజ్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు . ఆనాటి కాలంలో మహమ్మదీయ రాజుల దురాగతాలను అరికట్టాడు. హిందూ దేవాలయాలను పరిరక్షించాడు. హిందూ ధర్మపరిరక్షకుడుగా సమస్త మానవాళికి ఆదర్శం అన్నారు. ఆయన చూపించిన మార్గాన్ని యువత ఆదర్శంగా తీసుకోని తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. మంగళగిరి శ్రీనివాసులు , డా. మహేందర్, వి. గణేష్, మహ్మద్ రఫీ, విద్యార్థులు భాస్కర్ , నరేందర్, వీరేష్ , నవీన్, బలిచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు. బోధనేతర సిబ్బంది రమేష్ , అన్వేష్, వెంకటేష్ మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## గద్వాల జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తుప్పు పట్టడానికి చేరువలో ఉన్న 2D ECHO మిషన్






జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ నందు గుండెకు సంబంధించిన ముఖ్యమైన టెస్ట్ చేయడం కోసం 2D. ECHO... కానీ ఈ మిషన్ గద్వాల ఏరియా జిల్లా ఆసుపత్రికి జూలై 2023 రోజు ప్రారంభించారు. కానీ 2D. ECHO సంబంధించిన టెక్నీషియన్ ఇంతవరకు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి అపాయింట్ కాలేదు, టెక్నీషియన్ లేనందువలన గుండెకు సంబంధించిన పరీక్షలు చేయడానికి మిషన్ వాడకంలో లేదు 2023 నుండి 2D. ECHO మిషన్ వాడకం చేయకపోవడం వలన ఖరీదైన ఈ మిషన్ తుప్పు పట్టడానికి చేరువలో ఉందని కొందరు అంటున్నారు .ఈ జనరేషన్ లో చాలామందికి పిల్లలకు, వయసుతో నిమిత్తం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయి, గుండెకు సంబంధించిన ముఖ్యమైన టెస్ట్ 2D. ECHO, పరీక్షల్లోనే గుండెకు సంబంధించిన విషయాలు వెల్లడవుతాయి .కాబట్టి టెక్నీషియన్ గుండెకు సంబంధించిన డాక్టర్ ను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేటట్లు జిల్లాలోని ప్రజాప్రతినిధులు చొరవ చూపి మన గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రినీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని , తెలంగాణ ప్రభుత్వాన్ని, జిల్లాలో ఉన్న ఎమ్మెల్యే లను, ప్రజాప్రతినిధులను గద్వాల ప్రజలు కోరుతున్నారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన డి.ఏ.వి విద్యార్థి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా డి ఏ వి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రామ్ చరణ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. కబడ్డీ అసోసియేషన్ వారు వికారాబాద్ లో ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు నిర్వహించు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జోగులాంబ గద్వాల జిల్లా డి ఏ వి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రామ్ చరణ్ ను వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. రవిను జెన్కో ఎస్ ఈ.పి .శ్రీధర్ , డిఏవి విద్యాసంస్థల ఏ ఆర్ ఓ శేషాద్రి నాయుడు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.యాదవ రెడ్డి , పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆనందం వ్యక్తపరిచారు.

## గండిపేట సమీపంలో కారు బీభత్సం

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) హైదరాబాద్ నార్సింగి పరిధిలో కారు బీభత్సం సృష్టించింది. శంకర్‌పల్లి నుంచి నార్సింగి వస్తుండగా.. బుధవారం తెల్లవారుజామున గండిపేట్ సమీపంలో సీబీఐటీ కళాశాల వద్ద పిల్లర్‌ను ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్పందించిన స్థానికులు వెంటనే వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608